**ప్రతి నీటి బొట్టు విలువైనదే భవిష్యత్‌కు అది కీలకం**

CNR
CVSR DIGITAL NEWS

**ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రయత్నిద్దాం**

18 సెప్టెంబర్ 2026 | ప్రత్యేక సంచిక | cvsr.in

కరువు వేళ..
రైతు చుట్టూ రాజకీయం

# వర్షం తగ్గింది.. రాజకీయ వేడి పెరిగింది

పంపులు ఆన్ చేయడం.. గేట్లు ఎత్తడం.. ఫొటోలకు పోజులివ్వడం.. వర్షాభావ పరిస్థితులపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తూ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. రాష్ట్రంలో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని చెబుతూ సీఎం చంద్రబాబుపై విమర్శల బాణాలు సంధించారు. ఎల్‌నినో ముప్పు ముందే తెలిసినా రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. సాగునీటి నుంచి పంటల బీమా వరకు పలు అంశాలను ప్రస్తావించిన జగన్.. రైతుల కష్టాలను ముందుపెట్టి ప్రభుత్వ స్పందనను ప్రశ్నించారు.

**పంపులు.. గేట్లు..**
**జగన్ బాణాల వెనుకేంటి?**

అయితే వర్షాభావం ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే పరిమితమైన సమస్య కాదు. దేశంలోని దక్షిణ, తూర్పు ప్రాంతాల్లోనూ సాధారణం కంటే తక్కువ వర్షపాతం వ్యవసాయంపై ప్రభావం చూపుతోంది. దేశవ్యాప్తంగా వరి ఉత్పత్తి కూడా తగ్గే అవకాశముందని పరిశ్రమ వర్గాల అంచనాలు చెబుతున్నాయి. ఏపీలో మాత్రం వర్షపాతం లోటు మరింత తీవ్రంగా నమోదైంది. సెప్టెంబర్ 12 నాటికి సాధారణంగా 476.1 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 218.2 మిల్లీమీటర్లే నమోదయ్యాయని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. అంటే అప్పటికి లోటు 54.2 శాతానికి చేరింది.

**బీమా పెరిగింది..**
**రైతుకు భరోసా దక్కిందా?**

ఇక్కడే జగన్ విమర్శల్లో మరో అంశం చర్చకు వస్తోంది. ఎల్‌నినో ముప్పు ప్రభుత్వానికి తెలియని పరిణామం కాదని ఆయన గుర్తుచేశారు. ఫిబ్రవరి 4నే సీఎం చంద్రబాబు ఎల్‌నినో ప్రభావంపై హెచ్చరించారని జగన్ స్వయంగా తన విమర్శల్లో ప్రస్తావించారు. ఆ తర్వాత వర్షపాతం తగ్గుతున్న కొద్దీ ప్రభుత్వం కూడా ప్రత్యామ్నాయ పంటలు, అత్యవసర విత్తనాలు, రైతులకు ముందస్తు సూచనలు, కంట్రోల్ రూమ్ వంటి చర్యలను చేపట్టింది. జూలైలోనే 122 హైరిస్క్ మండలాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణపై అధికారులు దృష్టిపెట్టారు. దీంతో ముప్పు తెలుసా? అన్నదానికంటే.. చర్యలు సరిపోయాయా? అన్నదే అసలు ప్రశ్నగా మారుతోంది.

ఆ ప్రశ్నకు క్షేత్రస్థాయి పరిస్థితులే సమాధానం చెప్పాలి. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు ఉందని జగన్ పేర్కొన్నారు. 688 మండలాల్లో 628 చోట్ల కరువు తరహా పరిస్థితులు ఉన్నాయని, అందులో 332 మండలాల్లో పరిస్థితి తీవ్రంగా ఉందని ఆయన ఆరోపించారు.

**వర్షం తగ్గింది..**
**రైతు నష్టం లెక్కెంత?**

సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరగాల్సి ఉండగా 56.4 లక్షల ఎకరాల్లోనే పంటలు వేశారని చెప్పారు. దాదాపు 20 లక్షల ఎకరాల్లో విత్తనాలే పడలేదన్నది వైసీపీ చెబుతున్న లెక్క.

వర్షాలు తగ్గుతున్న సంకేతాలతో ప్రభుత్వం కూడా మధ్యలో కార్యాచరణను మరింత విస్తరించింది. జూలైలో అత్యవసర విత్తన ప్రణాళిక, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, తేమ పరిరక్షణ చర్యలపై అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. రైతులకు వాట్సాప్, ఎస్‌ఎంఎస్, ఐవీఆర్‌ఎస్ సహా వివిధ మార్గాల్లో సూచనలు పంపుతున్నట్లు వ్యవసాయ శాఖ తెలిపింది. ఆగస్టులో అసెంబ్లీ వేదికగా సీఎం చంద్రబాబు 5 అంశాలతో ఎల్‌నినో కార్యాచరణను ప్రకటించారు. తాజాగా తేమ కొరత ఎదుర్కొంటున్న పంటలను కాపాడేందుకు అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరుతో రక్షక తడులు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.



అయితే ప్రభుత్వ కార్యాచరణ ఒకవైపు ఉంటే.. రైతుకు చివరకు ఎదురైన నష్టం మరోవైపు ఉంది. పంటలు వేసిన రైతులకు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు నష్టం వాటిల్లిందని జగన్ ఆరోపిస్తున్నారు. కంది, పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, వరితో పాటు పండ్ల తోటలు కూడా దెబ్బతిన్నాయని చెబుతున్నారు. కరువు మండలాలను ప్రకటించాలని, సాగు చేయలేని భూములకు ఎకరాకు రూ.15 వేలు, దెబ్బతిన్న పంటలకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలతో ఎంత పంటను కాపాడగలిగారు? వాస్తవ నష్టం ఎంత? అన్న లెక్కలే ఈ ఆరోపణలకు అసలు పరీక్ష.

ఇందులో పంటల బీమా అంశమే మరో కీలక మలుపు. ఉచిత పంటల బీమాను తిరిగి అమలు చేయాలని జగన్ డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ప్రస్తుత ప్రభుత్వం ఖరీఫ్ 2026లో బీమా నమోదును భారీగా పెంచినట్లు చెబుతోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం దరఖాస్తులు గత ఖరీఫ్‌లోని 19.50 లక్షల నుంచి ఈసారి 35.17 లక్షలకు పెరిగాయి. బీమా పరిధిలోని విస్తీర్ణం 7.83 లక్షల హెక్టార్ల నుంచి 15.17 లక్షల హెక్టార్లకు చేరిందని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. దీంతో చర్చ బీమా ఉందా, లేదా? అనే స్థాయిని దాటి.. రైతు ప్రీమియం, కవరేజ్, క్లెయిమ్ ఎంత అన్నదానిపైకి వెళుతోంది.

అసలు గత వైసీపీ ప్రభుత్వంలోని పంటల బీమా విధానానికి, ఇప్పుడు అమలవుతున్న విధానానికి రైతు కోణంలో తేడా ఏమిటన్నది ఇక్కడ కీలకం. జగన్ ఉచిత పంటల బీమా పునరుద్ధరణ కోరుతుంటే, కూటమి ప్రభుత్వం PMFBY, వాతావరణ ఆధారిత RWBCIS కింద ఎక్కువమంది రైతులను బీమా పరిధిలోకి తెచ్చామని చెబుతోంది. నమోదైన రైతుల సంఖ్య పెరగడం ఒక లెక్క అయితే, వర్షాభావంతో నష్టపోయిన రైతుకు చివరకు ఎంత క్లెయిమ్ వస్తుంది? ఏ పంటలకు ఏ ప్రమాణాలతో పరిహారం నిర్ణయిస్తారు?

**ఫిబ్రవరిలోనే హెచ్చరిక..**
**చర్యలు సరిపోయాయా?**

**కరువు వేళ..**
**వైసీపీ గురి ప్రభుత్వమేనా?**

ప్రీమియంలో రైతు వాటా ఎంత? అన్న అంశాలే బీమా భరోసా వాస్తవ రూపాన్ని తేల్చనున్నాయి.

ఈ కరువు చర్చకు ఇప్పుడు రాజకీయ కోణం కూడా తోడైంది. ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులతో ప్రత్యేకంగా సమావేశమైన జగన్.. కరువు ప్రభావిత ప్రాంతాల్లో రైతులను కలవాలని, జిల్లాలవారీ సమస్యలను గుర్తించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పార్టీ నేతలకు సూచించారు. పరిస్థితి తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో తానూ పర్యటిస్తానని ప్రకటించారు. అంటే రైతాంగ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే కార్యక్రమాన్ని వైసీపీ క్షేత్రస్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. రానున్న రోజుల్లో పరిహారం, కరువు మండలాల ప్రకటన, బీమా అంశాలు అధికార కూటమి - వైసీపీ మధ్య మరింత చర్చకు దారితీసే అవకాశం కనిపిస్తోంది.

ఇక్కడ జగన్ ఎంచుకున్న రాజకీయ భాష కూడా ఆసక్తిని రేపుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలపై టీడీపీ నేతలు బటన్ నొక్కడం అంటూ విమర్శలు చేసేవారు. ఇప్పుడు జగన్ మాత్రం పంపులు ఆన్ చేయడం.. గేట్లు ఎత్తడం.. ఫొటోలకు పోజులివ్వడం అంటూ చంద్రబాబు ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పాత బటన్ విమర్శకు ఇది నేరుగా కౌంటర్ అని జగన్ చెప్పకపోయినా.. ప్రభుత్వ పనితీరును అదే తరహా రాజకీయ భాషతో ప్రశ్నించే ప్రయత్నం మాత్రం కనిపిస్తోంది. రైతు సమస్యను ముందుపెట్టి ప్రభుత్వంపై విమర్శలకు మరింత పదును పెట్టడం వైసీపీ తాజా కార్యాచరణలో స్పష్టంగా కనిపిస్తోంది.

అయితే రాజకీయ విమర్శలు ఎంత పదునెక్కినా రైతు దగ్గర లెక్కే చివరకు కీలకం. వర్షాభావంతో ఎంత సాగు తగ్గింది? పంటలవారీగా నష్టం ఎంత? ఎన్ని మండలాలు అధికారికంగా కరువు ప్రమాణాలకు సరిపోతున్నాయి? బీమా పరిధిలో ఉన్న రైతుల్లో ఎంతమందికి క్లెయిమ్ వస్తుంది? ముందస్తు హెచ్చరికల తర్వాత చేపట్టిన ప్రత్యామ్నాయ పంటలు, అత్యవసర విత్తనాలు, రక్షక తడుల కార్యక్రమాలు ఎంతవరకు ఫలించాయి? ప్రభుత్వం ఈ లెక్కలను ముందుపెడితేనే జగన్ ఆరోపణల్లో వాస్తవమెంత, ప్రభుత్వ చర్యల ఫలితమెంత అన్నది తేలుతుంది. అప్పటివరకు వర్షం తగ్గినా.. రైతు చుట్టూ రాజకీయ వేడి మాత్రం తగ్గేలా కనిపించడం లేదు.

**రక్తదానం చేద్దాం - ప్రాణాలు కాపాడుదాం**

© 2026 CVSR Digital News | cvsr.in | Privacy Policy | Terms & Conditions